# భిక్షగాడి పాట

డాక్టర్ సమ్మనూరు రమేష్ బాబు

ఈశ్వరీ! నిన్నే నమ్మితి....
భూలోకమాత
ఈశ్వరీ! నిన్నే నమ్మితి...

రైలులో వినిపించే ఆ పాట నన్ను ఎన్నోసార్లు కదిలించింది. ఆ పాట పాడేవాడు ఊరూపేరూలేని ఓ భిక్షగాడు. గొంతులో కమ్మదనంలేదు. పాడే తీరులో శాస్త్రజ్ఞానంలేదు. కాని గుండెలనిండా నిండుకొన్న ఆర్తి జీరవోయిన ఆ గొంతులో గంగాస్రవంతిలా ఎగసివచ్చి ఎంతటి హృదార్ద్రునైనా మాన్ప గలుగుతుంది.

అందుకే ఆ పాటంటే నాకంత ఇష్టం! నన్ను నేను మైమరచిపోతాను. మళ్ళీ అడిగి పాడించుకోవాలని ఉంటుంది కాని... నాచుట్టూఉన్న సభ్యసమాజం నన్ను అనాగరికుణ్ణిగా ముద్రిస్తుందేమోనని బెరకు.

ఏమ్రిబతుకో అర్థంకాదు. ఇష్టమున్నవి కొన్ని వదులుకోవాలి. ఇష్టం లేనివి కొన్ని చేసితీరాలి. ఈ యిష్టాయిష్టాల నడుమ మనసు ఎంత కష్టపడు తుందో ఆ దేవుడికే తెలుసు!

జీవితమంతా నటనే! ప్రతిఒకరూ నటిస్తూనే ఉంటారు.

ఎక్కడ అభిమానం ఉంటుందో ఎక్కడ వాత్సల్యం పొంగుతుందో ఎక్కడైతే స్వార్థమెరుగని స్నేహప్రవృత్తి వెల్లివిరుస్తుందో ఎక్కడైతే ఏ కల్మషమూలేని పసిహృదయం కన్నతల్లిలా లాలిస్తుందో... అక్కడ నిజంగా మనుషులుంటారు.

అయితే ఆ చోటెక్కడ? చూపే దిక్కెవ్వరు?

అందుకే నేనూ స్వగతంగా అనుకొంటాను...



ఈశ్వరీ! నిన్నే నమ్మితి...

భూలోకమాత

ఈశ్వరీ! నిన్నేనమ్మితి....

చెమ్మగిల్లిన కళ్ళతో ఆ భిక్షగానివైపుచూచాను. కడుపు తరుక్కుపోయింది.

మనసులో ఎవరో ముల్లుపెట్టి కెలికినట్లయింది.

వృద్ధాప్యం బాగా ఆవరించింది. దారిద్ర్యం వితండ తాండవంచేస్తోంది! కళ్ళల్లో పువ్వులు మొలుస్తున్నాయి. కాళ్ళల్లో ముడతలు ఒళ్ళు చేసుకొంటున్నాయి. నీరసం, ఆయాసం నిండుకొన్న హృదయంలో ఏదో విషాదం! గాడాంధకారం కమ్ముకొన్న ఆ నిరామయ ముఖలోగిలిలో ఎక్కడో ఏమూలో చిరు ఆశాదీపం. పుట్టగోచీతప్ప ఒంటిమీద ఏమీలేదు. చేతిలో సత్తుగిన్నె తప్పనిస్తే ఇంకేమీ లేదు. చిల్లర గలగలలాడిస్తూ పెదవులు అప్రయత్నంగానే కదలిస్తున్నాడు. ఎన్ని ఏళ్ళుగా ఎన్నివేలమైళ్ళు నడిచాయో తెలియదుకాని ఆ కాళ్ళుకూడా చకచకా నడచిపోతున్నాయి.

నేను ఆ భిక్షగాడు పోతుంటే చూస్తూఉన్నాను. కనుమరుగవుతున్న కనకదుర్గమ్మ కొండనుకూడా చూస్తూఉన్నాను. రైలు కుదింపులు ఆ భిక్షగానిపైన ఏవిధమైన ప్రభావాన్ని చూపలేకపోతున్నాయి. వేగంగా కదులుతున్న రైల్లో అలా రోజూ తిరుగుతూ బిచ్చం అడగడం మామూలేకాబోలు!

గుంటూరునుంచి విజయవాడకి విజయవాడనుంచి గుంటూరుకి రోజూ తిరగడం నాకు కొత్త అనుభవాలను చవిచూపుతోంది. ఎందరో మనుషులు! ఎన్నోరకాల వారు!

కళ్ళురెండూ లేకపోయినా నిమ్మఒప్పులు అమ్ముకొంటూ బ్రతికే సుబ్బారావులూ, చేతుల్లేకపోయినా వేరుశనక్కాయలు అమ్ముకొంటూ పబ్బంగడుపుకొనే పార్వతమ్మలూ, కూలీనాలీచేసుకొని కాయకష్టం మరచిపోడానికి నాటుసారాకొట్టి ఈ లోకాన్నే మరచిపోయే ఇస్మాయిల్‌సాబ్‌లూ, ఒక ఊరంటూ లేకుండా దేశాటనచేస్తూ ఎందుకు బ్రతకాలోకూడా తెలియకుండా కాలాన్ని వెళ్ళబోసే లంబాడీ గవరమ్మలూ....

ఇలా ఎంతమందో!

చతుర్ముఖపారాయణంచేసే ఎన్జీవోలూ.... వాళ్ళ సమస్యలు, సందేహాలు, మధ్యతరగతి కోరికలు!

ఎవరినీ పట్టించుకోకుండా "ఫ్యూచర్" చదువుతూ కూర్చొనే ప్రొఫెసర్లు... ఈ సమాజానికి అవసరంలేని ఆలోచనలు, ఆదర్శాలు, చదువుకొన్న గాలాలు!

పంట ఎదిగొస్తుందో లేదోనని చింతాక్రాంతులై కళ్లు నలుపుకొంటూ చుట్టపొగవదిలే అన్నదాతలు.... బీడునేలలు, నీటిఎద్దడులు, కలవరపెట్టే సర్కారువారి బకాయిలూ!

కడుపునింపుకోవడం కోసం ఒళ్ళమ్ముకొంటూ వెగటు పౌడరు వాసనల నడుమా కిళ్ళీ ఎరుపులమధ్యా కొట్టుమిట్టాడుకొనే అభాగ్యజీవులు... రేపు పై అపనమ్మకం, సంఘంపైకసి, సభ్యతను మరచిపోయిన తమ జీవితంపై అక్కసు!

ఒక గంట రైలుప్రయాణంలో ఎన్నెన్ని ప్రహసనాలు!

ఎవరెలావెళ్ళినా ఏది ఏమైనా కూతవేస్తూ పరుగెత్తివెళ్ళే రైలులాంటిదిలా ఈ కాలం...

ఇంకా నన్ను పసివాడనే అమ్మ అనుకొంటుంది కాని నాకు మూడు పదులు నిండాయి.

ఇప్పుడు నా కడుపున ఇద్దరు పసివారు.

ఎంత చిత్రమైందీ జీవితం! దుఃఖం సుఖం దుఃఖం... చీకటి వెలుతురూ చీకటి.... ద్వైతం.... అద్వైతం.... విశిష్టాద్వైతం...

ఆలోచనల్లో మునిగిన నాకు ఎవరివో పెద్దగా మాటలు వినిపించాయి.

—వెధవ న్యూసెన్సు. ప్రతిచోటా తగలడతారు. సినిమాకెళ్తే సినిమాహాల్లో మనకంటే ముందుఉంటారు. బస్టాండుకెళితే అక్కడా ఎదురవుతారు. స్టేషన్‌కిపోతే అక్కడా చస్తారు. భగవంతుడా! అనుకొంటూ గుడికెళితే ధర్మం, ధర్మం అంటూ ఎదురవుతారు. తప్పించుకొని పారిపోదామని బస్సెక్కినా రైలెక్కినా చివరికి విమానం ఎక్కినా ఈ అడుక్కుతినేవాళ్ళ బాధ తప్పడం లేదు. ఛఛ! వెళ్ళు! అడుక్కోవడంలోకూడా వెధవపాటొకటి! వాయిస్ పొల్యూషనూ... ఫోఫో! పక్కకి తగలడు— పెద్దగామాట్లాడిన ఆ పెద్దమనిషి పేరుమోసిన ఓ పెద్ద డాక్టర్! పక్కనే ఆయన భార్యఉంది. కోట్లకు పడగలెత్తిన ఆ డాక్టర్‌కు ఇంటా బయటా మంచి పరపతికూడా ఉందని వినికిడి. అందుకే ఆయన కనిపిస్తేచాలు ఎన్నో చేతులు నమస్కారం చేస్తాయి. కొందరి తలలైతే పాదాలకికూడా మొక్కుతాయి!

నేనా భిక్షగాణ్ని చూసాను. ఓ మూలగా ఒదిగికూర్చొని కృష్ణానది వైపుకి చూస్తున్నాడు. రైలు బాగా వేగంగాపోతోంది. ఆకాశంనిండా సిమెంటు ఫ్యాక్టరీ వదలిన నల్లటి పొగ.

ఆ పెద్దమనిషి ఇంకా ఏదేదో మాట్లాడుతున్నాడు కాని...నామనస్సంతా...

ఈశ్వరీ! నిన్నే నమ్మితి...

భూలోకమాత

ఈశ్వరీ! నిన్నే నమ్మితి....

పాటపైనే ఉంది. నాకు ఎంతో ఊరటనిచ్చిన ఆ పాట మరొకడికి వెధవ పాటనా? ఈ తేడా ఎందుకొస్తోంది? సైకాలజీ ఎందుకు మారుతుంది? దానిని మార్చేది ఏమిటి లేక ఎవరు?

ది న్యూయార్క్ రివ్యూ ఆఫ్ బుక్స్‌లో ఒక విచిత్రమైన విషయం ఎప్పుడో చదివింది అనుకోకుండా జ్ఞాపకానికి వచ్చింది.

ఒక క్రైస్తవసన్యాసిని - పద్దెనిమిదేళ్ళ పడుచుపిల్ల - అసహ్యం అనే భావాన్ని చంపుకునేందుకు ఒక కుష్ఠురోగి చేతివేళ్ళలోని చీమునీ కాలివేళ్ళలోని చీమునీ నోటితో చీకి ఉమ్మివేస్తుంది. ఆమెకు ఏసుక్రీస్తు తరచూ దర్శనమిస్తూ ఉంటాడు. అవధూతల లక్షణంకూడా ఇంతేకదా! మహావీర వర్ధమానుడు నగ్నంగా ఊళ్లవెంబడి తిరుగుతూ క్రిమికీటకాదులు తన దేహాన్ని పట్టుకొని కొరికి బాధ పెడుతున్నా చిరునవ్వు నవ్వుతూఉండేవాడట!

ఏమిటీ వింత ప్రవృత్తులు...

మరోసన్యాసిని ఎన్నోరకాల మహిమలుచూపి దేవదేవునికి ఎంతో ప్రీతిపాత్రురాలు అని నిరూపించుకొనికూడా స్వలింగ సంపర్కం, హస్తప్రయోగం మొదలైన మానవ బలహీనతలకు లోబడిపోయింది. దేవుడే నన్ను అలా చేయమని ఆదేశించాడని ఆమె చెప్పడం ప్రారంభించింది.

ఇదీ విపరీతమా.... పతనమా.... ఉన్మాదమా.... అర్థంకాదు.

ఎన్నోవిషయాలు రకరకాల సందేహాలను కలిగిస్తూ ఉంటాయి. అందులో ఇదికూడా ఒకటి అని సరిపెట్టుకోనా? అంతకంటే చేయగలిగిందేముంది?

నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ "అమ్మా" అన్న పెద్దకేక వినిపించింది. భిక్షగాడే రైల్లోంచి క్రిందపడిపోయాడేమోనని అనిపించింది నాకు. అదుర్దాగా చూచాను.

భిక్షగాడు యథాప్రకారం నిర్వికారంగా కూర్చొని ఉన్నాడు. "అరిచిందెవరబ్బా" అని అనుకొంటుండగనే మెలికలు తిరుగుతున్న డాక్టర్ కనిపించాడు. అయ్యో! భరించలేను! గుండెల్లో పోటు! — అంటూ అరుస్తున్నాడు.

ఆయనభార్య ముఖం భయంతో నిండిపోయింది.

చుట్టూ జనం మూగారు. రైలు పోతూనేఉంది.

– అరెరె! గుండెపోటా! చాలా ప్రమాదంసుమా!– ఎవరో అన్నారు.

– కనకదుర్గమ్మకి ముడుపుకట్టుకోండి ఆపదమంచి గట్టెక్కుతారు– ఎవరో ఆడకూతురు సలహాచెప్పింది.

– మంగళగిరి పానకాలసామికి నూటెనిమిది బిందెల పానకం పొయ్యం డమ్మా. ఇక చస్తే గుండెపోటురాదు – ఎవరో పల్లెటూరివాడు తనకు తోచింది చెప్పాడు.

– నాకో సందేహం– ఆపివేసాడు ఓ బట్టతలాయన.

ఏమిటా సందేహం అన్నట్లు అందరూ ఆతణ్ని చూచారు. అందరితో పాటు నేనుకూడా!

– మరేంలేదు. ఆ భిక్షగాడు మామూలువాడిలా లేడు. మాయలమారిలా ఉన్నాడు.

ఈ డాక్టరుగారు ఇంతకుముందు వాణ్ని తిట్టారుకదా! దాంతో వాడికి కోపంవచ్చి ఏదైనా మంత్రంవేసాడేమో! అందుకే ఈయనకి గుండెల్లోనొప్పి వచ్చిఉంటుంది–

బట్టతలాయన మాటలు అందరిమీద పనిచేసాయి. కొందరు భయం భయంగా భిక్షగాడివైపు చూచారు. కొందరు సందేహంగా చూచారు. మరికొందరు అక్కసుగా చూచారు. ఇంకొందరు యధాలాపంగా చూచారు.

భిక్షగాడుమాత్రం ఇదేదీ పట్టించుకోకుండా రైలు ఎప్పుడు ఆగుతుందా అని చూస్తున్నాడు. కళ్ళు మూసుకొని తెరుస్తున్నాడు.

డాక్టర్‌కు ఏమనిపించిందో ఏమో... లేచి నిలబడి

– నాది తప్పయిపోయింది. నన్ను బాధపెట్టవద్దు ఇదిగో ఇదిగో వందరూపాయలనోటు తీసుకో– అంటూ భిక్షగాడికి అందించారు.

డాక్టర్ భార్యఇచ్చిన నీళ్ళుతాగి సేదదీరాడు. గుండెనొప్పి నిమిషాల్లో తగ్గిపోయింది. సాకంతా ఆశ్చర్యంగాఉంది.

భిక్షగాడిదగ్గర ఏదో మంత్రముందని కొందరూ కాదు కాదు ఏదో శక్తి ఉందని కొందరూ మాట్లాడుకొంటున్నారు. ఎంతోమంది వెళ్ళి ఆ భిక్షగాడికి దండంపెట్టి పదీ పరకా రూపాయ్ రెండ్రూపాయలూ ఐదురూపాయలూ పది రూపాయలూ చొప్పున ఇస్తున్నారు.

భిక్షగాడికి ఇదంతా అయోమయంగా ఉంది. ఎంత అడుక్కున్నా పది రూపాయలు రాని తనబ్రతుకులో ఈవేళ ఇన్నిరూపాయలా అన్న భావం వాడి మొహంలో కనిపిస్తోంది.

నేనెక్కిన రైలుపెట్టెలోఉన్నవారందరూ ఆ భిక్షగాడికి వాళ్ళకు తోచినంత ఇచ్చారు. నాదగ్గర ఇవ్వడానికి నిజంగా ఏమీ లేదనేచెప్పాలి. ఐదురూపాయల నోటు ఉంది. కానీ వెయ్యలేదు. నాశక్తి రూపాయలోపు! ఏమైతే అది అవుతుం దన్న తెగింపుఉంది నాకు. పయిగా ఆ భిక్షగాణ్ని చూస్తుంటే నాకేమీ అనిపించడం లేదు. నాలాంటి మనిషే కనిపిస్తున్నాడు.

మంగళగిరి కనిపిస్తుండగా భిక్షగాడిముందు రూపాయలకుప్ప తయా రయింది. వాడు ఆ కుప్పవైపు అదోలా చూస్తున్నాడు. ఏదో ఆలోచిస్తున్నాడు. ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా కదిలాడు. సత్తుగిన్నెనిండా ఆ రూపాయలను కుక్కాడు. మొత్తం కుప్పను సత్తుగిన్నెలో పట్టించాడు. లేచి నిలబడ్డాడు కళ్ళల్లో ఏదో బాధ! అర్థంకాని అసంతృప్తి!.

సిగ్నల్ ఇవ్వలేదుకాబోలు రైలు ఊరిబయటే ఆగిపోయింది. సరిగ్గా మాపెట్టె ఎదురుగ్గా పాచిపట్టిన నీటిగుంట ఒకటి ఉంది. ఏమనుకున్నాడో ఏమో ఆ భిక్షగాడు దిగాడు. అందరికళ్ళూ వాడిమీదే ఉన్నాయి. వాడు సత్తుగిన్నెను రెండు చేతులతోనూ గట్టిగాపట్టుకొని ఆ గుంటదగ్గరికి వెళ్ళాడు. ఒక్కసారి మేమున్న రైలుపెట్టె వైపు చూచాడు. మేమంతా వాణ్నేచూస్తున్నాము. ఆ సత్తు గిన్నెను విసురుగా గుంటలోకి గిరవాటువేసాడు. రూపాయికాగితాలు ఆ పాచి పట్టిన నీటిపై తేలసాగాయి. అయితే ఆ గుంటవైపు చూడకుండా రైలువైపుకి రాకుండా మైదానంలోకి నడుచుకొంటూ వెళ్ళిపోయాడు ఆ భిక్షగాడు.

ఈశ్వరీ! నిన్నే నమ్మితి....

భూలోకమాత

ఈశ్వరీ! నిన్నేనమ్మితి....

పాట రైలుకూతలో కలిసిపోయింది.

భయంతో దేవుణ్ని కొలవడంకాదు భక్తితో కొలవాలి– అని అమ్మ అన్న మాట గుర్తుకొచ్చింది.

దానమైనా అంతే దయతో ఇవ్వాలికాని ప్రాణభయంతోకాదు!

నాకు ఆ భిక్షగాడిని ఒక్కసారైనా చూడాలనీ, మళ్ళీ ఆపాట వినాలనీ ఉంది కాని....

ఎక్కడా ఆ భిక్షగాడు తరువాత ఎప్పుడూ కనిపించలేదు.

ఆ పాటమాత్రం అప్పుడప్పుడు నా పెదవులపై వినిపిస్తూ ఉంటుంది.




